వరంగల్‌లో జోస్ ఆలుక్కాస్ ఏర్పాటు చేసిన షోరూంను ప్రారంభిస్తున్న సినీనటి కీర్తి సురేశ్. చిత్రంలో జోస్ ఆలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ ఆలుక్కా తదితరులు. ఈ సందర్భంగా రూ.60 వేల విలువైన కొనుగోళ్లకు ప్రోత్సాహకంగా బంగారు నాణేన్ని ఉచితంగా సంస్థ అందిస్తున్నది. అలాగే వజ్రాలపై 20 శాతం, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం తక్కువ ధరలకే విక్రయిస్తున్నారు.

భగ్గుమన్న బంగారం

తులంపై రూ.1,200 వరకు పెరిగిన ధర

హైదరాబాద్, ఆగస్టు 17: బంగారం ధర మళ్లీ భగ్గుమన్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు దూసుకుపోవడంతో దేశీయ ధరలు పుంజుకున్నాయి. వచ్చే నెల సమీక్షలో ఫెడరల్ రిజర్వులు వడ్డీరేట్లను అర శాతం వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు వచ్చిన సంకేతాలు మదుపరులు తమ పెట్టుబడులను అతి సురక్షితమైన పుత్తడివైపు మళ్లించారు. దీంతో గ్లోబల్ మార్కెట్లో ఒకే రోజు ఔన్స్ ధర రెండు శాతం వరకు పెరిగాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో తులం పుత్తడి ధర అయితే ఏకంగా రూ.72 వేలు దాటింది. శుక్రవారం ముగింపుతో పోలిస్తే 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.1,150 అధికమై రూ.72,770 పలికింది. అటు 22 క్యారెట్ ధర కూడా రూ.1,050 అధికమై రూ.66,700కి చేరుకున్నది. బంగారంతో పాటు వెండి పరుగులు పెట్టింది. కిలో వెండి రూ.2000 అధికమై రూ.91 వేలు పలికింది. అంతకుముందు ఇది రూ.89 వేలుగా ఉన్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ లేకపోయినప్పటికీ ధరలు పెరగడం విశేషం. మరోవైపు పండుగ సీజన్, పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు.

పెద్ద లావాదేవీలపై ఐటీ దృష్టి

హోటళ్లు, హాస్పిటల్స్‌లో జరిగే లావాదేవీలపై దృష్టి సారించాలని సీబీడీటీ సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 17: దేశవ్యాప్తంగా పెద్ద మొత్తంలో జరిగే నగదు లావాదేవీలపై కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఆందోళన వ్యక్తంచేసింది. ముఖ్యంగా హోటళ్లు, లగ్జరీ బ్రాండ్ విక్రయ స్టోర్లు, హాస్పిటళ్లు, ఐవీఎఫ్ క్లినిక్స్‌లో పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలని ఆదాయ పన్ను మంత్రిత్వ శాఖకు కీలక సూచన చేసింది కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ). 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను సీబీడీటీ విడుదల చేసిన వార్షిక ప్రణాళికలో ఈ విషయాన్ని స్పష్టంచేసింది. సాధారణంగా రూ.2 లక్షలకు పైబడి నగదు లావాదేవీలు జరిగితే ఆ వివరాలు ఆర్థిక సంస్థలకు నివేదించాల్సి ఉంటుందని సీబీడీటీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కానీ నిబంధనలను అతిక్రమించి పెద్ద మొత్తంలో లావాదేవీలు జరుగుతున్నాయని, వీటిపై ప్రధానంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని ఐటీ శాఖకు సూచించింది. అలాగే పెద్ద మొత్తంలో జరిగే ఆర్థిక లావాదేవీలకు ఖచ్చితంగా పాన్ కార్డు జత చేయాల్సి ఉండగా, వీరు ఎలాంటి కార్డు వివరాలు ఇవ్వకుండానే జరుపుతున్నారని, దీనివల్ల ఆదాయ పన్ను శాఖకు భారీ నష్టం జరుగుతున్నదని, వీటిని మోస పూరిత లావాదేవీలుగా గుర్తించి వీటిపై చర్యలు తీసుకోవాలని సూచించింది.

లైంగికదాడులపై స్పందించలేదేం?

- ఎనిమిది నెలలుగా మహిళా కమిషన్ ఏమైంది?
- మహిళా ఎమ్మెల్యేలను సీఎం అవమానిస్తే ఎటుపోయింది?
- సంస్కారంతో మహిళలకు కేటీఆర్ క్షమాపణలు
- అయినా రాజకీయ లబ్ధి కోసం ఆయనపై విమర్శలు
- మాజీమంత్రులు సబిత, సునీతాలక్ష్మారెడ్డి, సత్యవతి

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ వాణీదేవి

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే మహిళా కమిషన్ ఎందుకు స్పందించలేదని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలను అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అవమానపర్చినప్పుడు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తన ప్రసంగంలో దొర్లిన పొరపాటుకు కేటీఆర్ బహిరంగంగా క్షమాపణ కూడా చెప్పారని, అయినా మహిళా కమిషన్ నోటీసులు ఇవ్వటం ఏమిటని అన్నారు. శనివారం తెలంగాణభవన్‌లో మాజీమంత్రులు సునీతా లక్ష్మారెడ్డి, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ వాణీదేవి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ముక్తవరం సుశీలారెడ్డితో కలిసి సబితాఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. హుందాతనంతో క్షమాపణ చెప్పిన కేటీఆర్‌ను మహిళాలోకం స్వాగతిస్తున్నదని.. అయినా కొందరు మహిళా నేతలు ఏదేదో మాట్లాడుతున్నారని అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇద్దరు మహిళా మంత్రులు, మహిళా కమిషన్ వేగంగా స్పందించారని.. 8 నెలల్లో మహిళలపై 1,800 లైంగిక దాడులు, హత్యలు జరిగితే ఎందుకు స్పందించలేదని నిలదీశారు. అత్యాచారానికి గురైన ఒక్క మహిళనైనా పరామర్శించారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో సీఎం, డిప్యూటీ సీఎం తమను అనకూడని మాటలంటే ఈ మహిళా కమిషన్, మంత్రులు ఎక్కడికి వెళ్లారని కడిగిపారేశారు. కేటీఆర్‌కు కేసీఆర్ సంస్కారం నేర్పారు కాబట్టే క్షమాపణ చెప్పారని, సీఎం రేవంత్‌కు ఎవరూ సంస్కారం నేర్పినట్టు లేరని చురకలంటించారు. గతంలో అసెంబ్లీ సాక్షిగా డీకే అరుణకు కేటీఆర్‌తో కేసీఆర్ క్షమాపణ చెప్పించారని.. ఇది తమ సంస్కారమని అన్నారు. హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఖండిస్తున్నామన్నారు. సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పైచేయి సాధించటంలో కేటీఆర్, హరీశ్‌రావు పాత్ర ప్రముఖంగా ఉన్నదని.. అందుకే వారిని సీఎం, కాంగ్రెస్ నేతలు టార్గెట్ చేస్తున్నారన్నారు. హరీశ్‌రావు ఒత్తిడితోనే ఈ మాత్రం రుణమాఫీ అయ్యిందని స్పష్టంచేశారు. సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సచివాలయం దగ్గర తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టినప్పుడే మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందన్నారు. మహిళలకు ఈ 8 నెలల్లో కాంగ్రెస్ చేసింది శూన్యమని విమర్శించారు. కొండా సురేఖ, సీతక్క కాంగ్రెస్ నుంచి రాలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవుపలికారు. వాణీదేవి మాట్లాడుతూ బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు సీఎం క్షమాపణ చెప్పకుండా మిగతా విషయాలు మాట్లాడటం దండగ అన్నారు.

సివిల్ సర్వెంట్స్‌ను బెదిరిస్తారా?

సీఎం సొంత మీడియా తీరుపై కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ఆల్ ఇండియా సర్వీస్‌కు చెందిన అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి తన మీడియా ద్వారా బెదిరింపులకు పాల్పడటమేమిటని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. సీఎంకు చెందిన మీడియా సంస్థగా చెప్పబడుతున్న ఓ టీవీ చానెల్ ప్రతినిధి ఐఏఎస్ ఆఫీసర్ కమలాసన్‌రెడ్డిని ఇబ్బందిపెట్టే విధంగా వ్యవహరించిన వీడియోను ఆయన ఎక్స్ ద్వారా షేర్ చేశారు. నిజాయితీ గల ఆఫీసర్‌గా పేరున్న కమలాసన్‌రెడ్డిని కావాలనే ఇబ్బంది పెడుతున్నట్టు స్పష్టంగా తెలుస్తుందని, ఇది దిగ్భ్రాంతికరమని అన్నారు. ఇలాంటి చర్యలు అధికారుల మనో నిబ్బరాన్ని దెబ్బతీస్తాయని, దీనికి కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

'పావనీ.. కాపాడుకోలేకపోయినందుకు క్షమించు'

సూర్యాపేట ఘటనపై కేటీఆర్ ఆవేదన

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): తండ్రిపై కండ్లెదుటే పాశవికంగా దాడి జరుగుతుంటే చూడలేక సాయం కోసం రోదించి 14 ఏళ్ల పావని చనిపోయిన సంఘటనపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా ఢీ కొత్తపల్లిలో భూతగదాలతో సోమయ్య అనే వ్యక్తిపై భార్య, కూతురు ముందే ముగ్గురు వ్యక్తులు దాడికి తెగబడ్డారని, తండ్రిని కాపాడుకునేందుకు పావని విలవించి స్పృహ తప్పి చనిపోయిందనే వార్త తెలిసిన ప్పటి నుంచి మనసంతా భారంగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పావని కుటుంబానికి కేటీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పావని నిన్ను కాపాడుకోలేకపోయినందుకు క్షమించు' అని కేటీఆర్ ఆవేదన చెందారు.

జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరుపెట్టాలి

- నేడు జయంతి సందర్భంగా ప్రకటించాలి
- మాజీ మంత్రి, శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం సర్వాయి పాపన్న జయంతి సందర్భంగానే ఆయన పేరిట జిల్లా పేరు ప్రకటించాలని కోరారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె రవి, రామచంద్రు నాయక్, రాంనర్సయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గతంలో సీఎంగా కేసీఆర్ నిర్ణయించారని, మూడు కోట్లు కేటాయిస్తూ జీవో ఇచ్చారని, ఆ మేరకు విగహం ఏర్పాటుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో ఖిలాషాపూర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దామని, ఆయన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రయత్నం చేసినట్టు తెలిపారు.

'అంబేద్కర్ ఓవర్సీస్'కు విశేష ఆదరణ

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): గిరిజన విద్యార్థుల విదేశీ విద్యకోసం అమలుచేస్తున్న అంబేద్కర్ ఓవర్సీస్ పథకానికి పూర్తిస్థాయి ఆదరణ లభిస్తున్నది. తొలుత 50 మంది లక్ష్యంగా ప్రారంభించిన పథకాన్ని ప్రస్తుతం ఏటా 100 మంది వినియోగించుకుంటున్నారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 2014-15లో అంబేద్కర్ ఓవర్సీస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక్కో విద్యార్థి విదేశీ విద్యకోసం రూ.20 లక్షల వరకు మంజూరు చేశారు. 2022-23 సంవత్సరంలో ఈ పథకాన్ని ఏటా 100 మందికి అమలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) నుంచి ఏటా 250 మంది గిరిజన విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులు కోరుతున్నారు.

'ఏసీబీ కేసులో ఆస్తులను నిందితుడే నిరూపించుకోవాలి'

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టడంపై ఏసీబీ నమోదు చేసిన కేసులో ఆ ఆస్తులు ఎలా వచ్చాయో నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితుడిపైనే ఉంటుందని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ కేసులో మాజీ పోస్టుమ్యాన్ సురేందర్‌కు దిగువ కోర్టు విధించిన మూడేండ్ల శిక్షను ఏడాదికి తగ్గించింది. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న సురేందర్‌ను జైలుకు పంపాలని స్పష్టం చేసింది.

చట్టవిరుద్ధంగా 'మార్గదర్శి' డిపాజిట్ల సేకరణ

- హైకోర్టులో ఆర్బీఐ కౌంటర్

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ప్రజల నుంచి మార్గదర్శి చిట్ ఫండ్స్ కంపెనీ చట్టవిరుద్ధంగా డిపాజిట్లను సేకరించిందని హైకోర్టులో ఆర్బీఐ కౌంటర్ దాఖలు చేసింది. తమ సంస్థపై 2008లో నాటి ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వేసిన వ్యాజ్యాన్ని కొట్టివేయాలని కోరుతూ మార్గదర్శి అధినేత రామోజీరావు, ఫైనాన్సియర్లు గతంలో పిటిషన్లు దాఖలు చేశారు. దీంతో మార్గదర్శిపై విచారణను నిలిపివేస్తున్నట్టు ఉమ్మడి హైకోర్టు ప్రకటించింది. దీన్ని సవాల్ చేస్తూ ఉండవల్లి సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఉమ్మడి హైకోర్టు తీర్పును రద్దు చేసింది. ఈ కేసు విచారణ పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఆర్బీఐ తరఫున సుభేందు దాస్ కౌంటర్ దాఖలు చేశారు. హిందూ అవిభాజ్య కుటుంబం పేరుతో చిట్ ఫండ్ కంపెనీని నెలకొల్పి, డిపాజిట్లు సేకరించడం చట్టవ్యతిరేకమని ఆ కౌంటర్‌లో పేర్కొన్నారు. ఆర్బీఐ చట్టంలోని 45ఎస్(1), 45ఎస్(2) సెక్షన్లకు విరుద్ధంగా మార్గదర్శి సంస్థ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిందని తప్పుపడుతూ.. రామోజీరావు తదితరుల పిటిషన్లను కొట్టివేశారు.

సుఖేశ్‌గుప్తాకు చుక్కెదురు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ఎంబీఎస్ జ్యువెలర్స్ అధినేత సుఖేశ్‌గుప్తాపై సీబీఐ కేసును కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎంఎంటీసీ ఫిర్యాదు మేరకు నమోదు చేసిన ఈ కేసును కొట్టివేయాలంటూ సుఖేశ్‌గుప్తా దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. బంగారం సరఫరాకు సంబంధించి ఎంఎంటీసీ అధికారులతో కలిసి ఆ సంస్థకు సుకేశ్‌గుప్తా రూ.194 కోట్ల నష్టం కలిగించినట్టు సీబీఐ తన చార్జిషీట్‌లో అభియోగాలు మోపినందున కింది కోర్టులో పిటిషనర్ విచారణను ఎదుర్కోవాల్సిందేనని జస్టిస్ కే సుజన తేల్చిచెప్పారు.

గడువులోగా దాఖలు చేయని బిడ్‌ను స్వీకరించకపోవడం సబబే: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): సింగరేణి బొగ్గు సరఫరా కోసం సకాలంలో దాఖలు చేయని బిడ్‌ను స్వీకరించకపోవడం సబబేనని హైకోర్టు తీర్పు చెప్పింది. సాంకేతిక కారణాల వల్ల ఆన్‌లైన్‌లో గడువులోగా బిడ్‌ను సమర్పించలేకపోయినందున తన బిడ్‌ను స్వీకరించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ కొత్తగూడెం వాసి కిశోర్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. గడువు దాటాక బిడ్లను స్వీకరించడం టెండర్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నది. అధికారులు దురుద్దేశపూరితంగా టెండర్‌ను తిరస్కరించినట్టయితేనే న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు ఉంటుందని, ఇక్కడ ఆ పరిస్థితి లేదని స్పష్టం చేసింది.

యాదవ మహాసభ యువజన అధ్యక్షుడిగా యశ్వంత్

హైదరాబాద్, ఆగస్టు17 (నమస్తే తెలంగాణ) : యాదవ మహాసభ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా గొర్ల యశ్వంత్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబురావుయాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్ యశ్వంత్‌కు శనివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ.. తనకు అవకాశం కల్పించిన యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గానికి, జిల్లాల అధ్యక్షులు, ముఖ్యనేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

చిత్రం

నార్నే నితిన్ హీరోగా నటించిన 'ఆయ్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. అంజి కే మణిపుత్ర దర్శకత్వంలో బన్నీ వాస్ నిర్మించారు. శనివారం అగ్ర హీరో ఎన్టీఆర్‌ను చిత్ర యూనిట్ సభ్యులు కలుసుకున్నారు. బాక్సాఫీస్ వద్ద గట్టిపోటీ ఉన్నా ఈ సినిమా అద్భుత విజయం సాధించిందని, వినోదం, సందేశం కలబోసిన మంచి కాన్సెప్ట్‌తో రూపొందించారని చిత్ర బృందాన్ని ఎన్టీఆర్ అభినందించారు.



ధగధగలాడుతున్న బంగారు నిధి

పవన్‌కల్యాణ్ 'హరిహరవీరమల్లు' సినిమా కొత్త షెడ్యూల్ ఈనెల 14 నుంచి మొదలైన విషయం తెలిసిందే. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఏ.దయాకరరావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఏ.ఎం.రత్నం సమర్పకుడు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన యుద్ధ సన్నివేశాలను దర్శకుడు జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్నారు. ఇదిలా వుంటే.. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న నిధి అగర్వాల్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాలోని ఆమె పాత్రకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో నిధి బంగారు చీరలో, ఒంటినిండా నగలతో మెరిసిపోతూ కనిపిస్తున్నది. పేదలకోసం రాజులను కొల్లగొట్టే రాబిన్‌హుడ్ తరహా పాత్రలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న ఈ చిత్రంలో బాబీడియోల్, అనుపమ్‌ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కళ: తోట తరణి, నిర్మాణం: మెగా సూర్య మూవీస్.

ప్రభాస్ చారిత్రక చిత్రం

'కల్కి 2898 ఏడీ' చిత్రంతో అపూర్వ విజయాన్ని సొంతం చేసుకున్నారు అగ్ర హీరో ప్రభాస్. అదే ఉత్సాహంతో ఆయన వరుస సినిమాలను పట్టాలెక్కిస్తున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం శనివారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇమాన్వి కథానాయికగా పరిచయమవుతున్నది. 1940 నేపథ్యంలో నడిచే ఈ కథలో ప్రభాస్ వారియర్ పాత్రలో కనిపిస్తారని చెబుతున్నారు. సీనియర్ నటులు మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రల్లో నటించనున్నారు. భారీ వ్యయంతో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సుధీప్ ఛటర్జీ, సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, ప్రొడక్షన్ డిజైనర్: రామకృష్ణ-మోనిక, వీఎఫ్ఎక్స్: కమల్ కన్నన్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.

'చాంపియన్' మొదలైంది

రోషన్ కథానాయకుడిగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'ఛాంపియన్' శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర దర్శకుడు నాగ్‌అశ్విన్ క్లాప్‌నిచ్చారు. ఈ సినిమాలో హీరో రోషన్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుందని, కథ, కథనాలు వైవిధ్యంగా ఉంటాయని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమా కోసం రోషన్ కంప్లీట్ మేకోవర్ అయ్యారని, ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచిందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఆర్.మది, ఆర్ట్: తోట తరణి, నిర్మాణ సంస్థలు: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్, దర్శకత్వం: ప్రదీప్ అద్వైతం.

దడపుట్టించే డిమాంటీ



అరుల్‌నిధి, ప్రియ భవానీశంకర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'డిమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్.జ్ఞానముత్తు దర్శకుడు. విజయసుబ్రహ్మణ్యన్, ఆర్.సి.రాజ్‌కుమార్ నిర్మాతలు. ఈ నెల 15న తమిళంలో విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతున్న ఈ సినిమా ఈ నెల 23న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే తెలుగులో విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన వస్తున్నదని, సినిమాకు కూడా అదే స్పందన వస్తుందని నమ్మకంతో ఉన్నామని మేకర్స్ తెలిపారు. ఆన్తి జాస్మేలైనెస్, సెరింగ్ డోర్జీ, అరుణ్ పాండియన్, ముత్తుకుమార్, మీనాక్షి గోవిందరాజన్, సరనో ఖాలిద్, అర్చన రవిచంద్రన్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: హరీశ్ కన్నన్, సంగీతం: సామ్ సీఎస్.

సందేశాత్మక కథతో 'అభినవ్'

స్వీయ దర్శకనిర్మాణంలో భీమగాని సుధాకర్ గౌడ్ రూపొందిస్తున్న బాలల చిత్రం 'అభినవ్'. ఇటీవల ఈ చిత్ర ట్రైలర్‌ను ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్ ఆవిష్కరించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, మాదకద్రవ్యాల మాఫియాను అణచివేయాలనే సందేశాత్మక కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్ఎస్ మరియు ఎన్‌సీసీ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లలో శిక్షణ పొంది దేశ రక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నదే ఈ సినిమా ప్రధాన ఉద్దేశ్యమని దర్శకనిర్మాత భీమగాని సుధాకర్‌గౌడ్ తెలిపారు. సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వందేమాతరం శ్రీనివాస్.



సూపర్ న్యాచురల్ జటాధర

సుధీర్‌బాబు నటించనున్న తాజా చిత్రానికి 'జటాధర' అనే టైటిల్ ఖరారు చేశారు. వచ్చే ఏడాది మహాశివరాత్రి కానుకగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు నిర్మాతలు శివన్ నారంగ్, ప్రేరణా అరోరా, ఉజ్వల్ ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. చేతిలో త్రిశూలంతో పవర్‌ఫుల్‌గా సుధీర్ బాబు ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. సూపర్ న్యాచురల్ ఫాంటసీ ప్రపంచంలోకి తీసుకెళ్లే కథాంశమిదని, ఈ కథకు 'జటాధర' టైటిల్ పర్‌ఫెక్ట్ యాప్ట్ అని చిత్ర దర్శకుడు వెంకట్ కల్యాణ్ తెలిపారు. ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, టాప్ టెక్నీషియన్స్ పని చేయనున్నారని, త్వరలో షూటింగ్ మొదలుపెడతామని మేకర్స్ తెలిపారు.

శివన్న బైలింగ్వల్

కన్నడ అగ్రనటుడు శివరాజ్‌కుమార్ నటిస్తున్న కన్నడ, తెలుగు బైలింగ్వల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం శనివారం లాంఛనంగా మొదలైంది. కార్తీక్ అద్వైత్ దర్శకుడు. ఎస్.ఎన్.రెడ్డి, సుధీర్.పి నిర్మాతలు. ఇందులో శివరాజ్‌కుమార్ అత్యంత శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, హై బడ్జెట్‌తో తెరకెక్కనున్న యాక్షన్ థ్రిల్లర్ ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఎ.జె.శెట్టి, సంగీతం: సామ్ సిఎస్, సమర్పణ: పద్మజ ఫిల్మ్స్ ఇండియా ప్రై.లిమిటెడ్, నిర్మాణం: భువనేశ్వరి పిక్చర్స్.

సినిమా చూసి రివ్యూ రాస్తా!

వంశీరామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకుడు. డా॥ మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మాతలు. ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం అగ్ర నిర్మాత దిల్ రాజు ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..సినిమా కాన్సెప్ట్ బాగుందని, జర్నలిస్ట్ మిత్రులైన ప్రభు, రాంబాబు నిర్మాణ పర్యవేక్షణలో సినిమా తెరకెక్కడం ఆనందంగా ఉందని, ఈ సినిమా చూసి తాను రివ్యూ రాస్తానని అన్నారు. సెన్సార్ వాళ్లు కూడా చిత్రాన్ని మెచ్చుకున్నారని జర్నలిస్ట్ ప్రభు తెలిపారు.

సుకుమార్ మాటలు ధైర్యాన్నిచ్చాయి!

రావు రమేష్ టైటిల్ రోల్ పోషించిన 'మారుతినగర్ సుబ్రమణ్యం' ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు లక్ష్మణ్ కార్య శనివారం పాత్రికేయులతో మాట్లాడుతూ 'ఈ కథ చెప్పగానే రావుగారు రమేష్ నవ్వుతూ ఓకే చేశారు.